నమస్తే తెలంగాణ



## జూన్ 20నుంచి టూరిజం సదస్సు

హైదరాబాద్, మే 11(నమస్తే తెలంగాణ): సినిమా, వెడ్డింగ్, హాస్పిటాలిటీ తదితర రంగాలకు సంబంధించిన వినూత్న ఎక్స్‌పరిమెంటల్ టూరిజం కాంక్లేవ్-24కు హైదరాబాద్ నగరం వేదిక కానున్నది. పర్యాటకరంగ అభివృద్ధిలో భాగంగా రాష్ట్ర పర్యాటకశాఖ, తెలంగాణ ఛాంబర్ ఆఫ్ కామర్స్ సంయుక్తాధ్వర్యంలో జూన్ 20 నుంచి 23వరకు హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీలో ఈ సదస్సును నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు.

## 25లేదా 27న ఎప్‌సెట్ ఫలితాలు!

హైదరాబాద్, మే 11 (నమస్తే తెలంగాణ): టీఎస్ ఎప్‌సెట్ పరీక్షలు ఈ నెల 7న ప్రారంభం కాగా, శనివారంతో ముగిశాయి. ఈ నెల 25న లేదా 27న ఫలితాల విడుదలకు జేఎన్టీయూ అధికారులు సన్నాహకాలు చేస్తున్నారు. శనివారం మేడ్చల్ -మల్కాజిగిరి జిల్లా మైసమ్మగూడలోని మల్లారెడ్డి ఇంజినీరింగ్ పరీక్షాకేంద్రానికి ఇద్దరు విద్యార్థులు ఆలస్యంగా రావడంతో అధికారులు పరీక్షకు అనుమతించలేదు. శనివారం నిర్వహించిన పరీక్షకు 94శాతం విద్యార్థులు హాజరైనట్టు కన్వీనర్ ప్రొఫెసర్ డీన్‌కుమార్ తెలిపారు.

## 18న 'టౌన్‌ప్లానింగ్'కు వైద్య పరీక్షలు

హైదరాబాద్, మే 11 (నమస్తే తెలంగాణ): మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ డిపార్టుమెంట్‌లో టౌన్‌ప్లానింగ్ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు ఈ నెల 18న వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. అభ్యర్థులు తప్పకుండా హాజరు కావాలని టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి నవీన్ నికోలస్ తెలిపారు.

## బీజేపీ ఎంపీ నవనీత్‌కౌర్‌పై కేసు నమోదు

సైదాబాద్, మే 11: ఎన్నికల కోడ్ ఉల్లంఘన కింద మహారాష్ట్ర అమరావతి ఎంపీ నవనీత్ కౌర్ రానాపై సైదాబాద్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ నెల 8న చంపాపేటలో హైదరాబాద్ బీజేపీ అభ్యర్థి మాధవీలతకు మద్దతుగా నిర్వహించిన ఎన్నికల సభలో నవనీత్ కౌర్ రానా వివాదస్పద వ్యాఖ్యలు చేశారు. 'విధుల్లో ఉన్న పోలీసులు పక్కకు తప్పుకొంటే ఓవైసీ సోదరులపై చర్యలకు 15 సెకన్ల సమయం చాలు' అంటూ రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారు. యాకత్‌పురా అసెంబ్లీ సెగ్మెంట్ ఫ్లయింగ్ స్క్వాడ్ టీం ఇన్‌చార్జి రాకేశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నవనీత్ కౌర్ రానాపై 505(2), 506, 171(సీ), 171(ఎఫ్), 171(జి) సహ భారతీయ శిక్షాస్మృతిలోని వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేశామని సైదాబాద్ ఇన్‌స్పెక్టర్ కే రాఘవేందర్ తెలిపారు. కాంగ్రెస్‌కు ఓటువేస్తే పాకిస్తాన్‌కు వేసినట్టేనని వ్యాఖ్యలు చేసిన ఆమెపై ఇదివరకే షాద్‌నగర్‌లో కేసు నమోదైంది.

## చేవెళ్ల డిక్లరేషన్ ఏమైంది

- ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ

ఖైరతాబాద్, మే 11: కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లు పెంచుతామంటూ చేవెళ్ల డిక్లరేషన్‌లో ప్రకటించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట తప్పారని ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ విమర్శించారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన పెద్దపల్లి ఎంపీ వెంకటేశ్ నేతతో కలిసి మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే రాజ్యాంగం రద్దవుతుందని, రిజర్వేషన్లు తొలగిస్తారంటూ ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్‌ఖర్గే, రాహుల్‌గాంధీ, రేవంత్‌రెడ్డి గోబెల్స్ ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. మోదీ తాను జీవించి ఉన్నంత కాలం రిజర్వేషన్లు రద్దు కావని, రాజ్యాంగాన్ని మార్చమని బహిరంగంగా ప్రకటించారని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలు కాంగ్రెస్ ట్రాప్‌లో పడొద్దని, ఈ ఎన్నికల్లో ఆ పార్టీని చిత్తుగా ఓడించి, బీజేపీని గెలిపించాలని పిలుపునిచ్చారు.

## క్యాట్‌ఫిష్‌ను గుర్తించేందుకు 'ఈడీఎన్ఏ'

హైదరాబాద్ సిటీబ్యూరో, మే 11 (నమస్తే తెలంగాణ): జలావరణాన్ని, జలచరాలను పరిరక్షించేందుకు హైదరాబాద్‌లోని సెంటర్ ఫర్ సెల్యులర్ అండ్ మాలిక్యులర్ బయాలజీ (సీసీఎంబీ) సరికొత్త ఎన్విరాన్‌మెంటల్ డీఎన్ఏ (ఈడీఎన్ఏ) విధానాన్ని రూపొందింది. దీన్ని తొలిసారి తూర్పు కనుమల్లో వినియోగించి అక్కడి జలవనరుల్లో చొరబడిన నిషేధిత క్యాట్‌ఫిష్ సంతతిని సమర్థంగా గుర్తించింది. మత్స్య సంపదకు తీవ్ర నష్టం కలిగించే క్యాట్‌ఫిష్‌ను సంప్రదాయ పద్ధతుల్లో గుర్తించడం కష్టం. అందుకే ఈ-డీఎన్ఏ విధానాన్ని సీసీఎంబీ డెవలప్ చేసింది. దీనిలో భాగంగా నీటిలోని నమూనాలను సేకరించి, అందులో ఉండే ఈడీఎన్ఏను ప్రత్యేక పద్ధతిలో వేరుచేస్తారు. అనంతరం క్యూపీసీఆర్ ఆంప్లికేషన్ పద్ధతిలో డీఎన్ఏను విశ్లేషించి క్యాట్‌ఫిష్ సంతతి ఏ స్థాయిలో ఉన్నదో తెలుసుకుంటారు. క్యాట్‌ఫిష్‌ను వేగంగా గుర్తించేందుకు ఈ విధానం ఎంతో దోహదపడుతుందని సీసీఎంబీ పరిశోధకులు చెప్పున్నారు.

# ఇదీ కాంగ్రెస్, బీజేపీ పరిస్థితి



వికారాబాద్ జిల్లా తాండూరు జనజాతర సభలో కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక గాంధీ మాట్లాడుతున్నప్పుడు ఖాళీగా ఉన్న కుర్చీలు



వికారాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన జనసభలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా ప్రసంగిస్తుండగా వెళ్లిపోతున్న ప్రజలు

## బడాబాబుల కోసమే బీజేపీ

- పదేండ్లలో మోదీ చేసిందేం లేదు
- నోట్ల రద్దు, జీఎస్టీతో పేదలపై భారం
- కాంగ్రెస్ అగ్ర నాయకురాలు ప్రియాంక గాంధీ ధ్వజం
- అనంతపద్మనాభ స్వామి సాక్షిగా ఆగస్టు 15 వరకు రుణమాఫీ
- జనజాతర సభలో సీఎం రేవంత్‌రెడ్డి మరో ఒట్టు

తాండూరు/కామారెడ్డి/పటాన్‌చెరు, మే 11: బడా బాబుల కోసమే బీజేపీ పనిచేస్తున్నదని, పదేండ్లలో ప్రధాని మోదీ దేశానికి చేసిందేమీ లేదని కాంగ్రెస్ అగ్రనాయకురాలు ప్రియాంక గాంధీ విమర్శించారు. నోట్ల రద్దు, జీఎస్టీతో పేదల నడ్డి విరిచారని మండిపడ్డారు. శనివారం వికారాబాద్ జిల్లా తాండూరులో జరిగిన జనజాతర సభ, కామారెడ్డి జిల్లా కేంద్రంలో నిర్వహించిన రోడ్‌షోలో టీపీసీసీ అధ్యక్షుడు, సీఎం రేవంత్‌రెడ్డితో కలిసి మాట్లాడారు. అసమర్థ, అసంబద్ధ పాలనా విధానాలతో దేశ ఆర్థిక, సామాజిక జీవనాన్ని బీజేపీ తీవ్ర సంక్షోభంలోకి నెట్టిందని ప్రియాంక ఆగ్రహం వ్యక్తంచేశారు.

అద్భుత ప్రసంగాలు, అమోఘమైన వాగ్దానాలు, హావభావ విన్యాసాలు, ఆచరణ లేని ఆదర్శాలతో దేశ ప్రజలను మోదీ బురిడీ కొట్టించారని ఎద్దేవా చేశారు. పంటలకు గిట్టుబాటు ధర కల్పించక రైతులు వ్యవసాయాన్నే మానేసే దుస్థితికి తెచ్చారని, వ్యవసాయ సబ్సిడీలు తగ్గించారని చెప్పారు. కార్పొరేట్లకు అనుకూల చట్టాలు తెచ్చి అదానీ, అంబానీలకు మేలు చేస్తూ పేదలను నట్టేట ముంచారని ఆరోపించారు. పదేండ్ల పాలనలో గ్యాస్, పెట్రోల్ ధరలను విపరీతంగా పెంచి సామాన్యుడి నడ్డి విరిచిన బీజేపీకి ఈ ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని కోరారు.

### అనంతపద్మనాభ స్వామి సాక్షిగా..

ఎన్నికల ప్రచారంలో భాగంగా రేవంత్‌రెడ్డి ఎక్కడికి వెళ్లినా అక్కడి దేవుడిపై ఒట్టు పెట్టి మరీ రుణమాఫీ అమలు చేస్తామని చెబుతున్నారు. కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో నమ్మకం సడలినందుకే ఆయన దేవుళ్లపై ఒట్టు పెడుతున్నట్టు విమర్శలు వస్తున్నాయి. ఇప్పటివరకు భద్రాద్రి రాముడు, బాసర సరస్వతి తదితర దేవుళ్లపై ఒట్టు పెట్టిన ఆయన తాజాగా తాండూరు సభలో మాట్లాడుతూ వికారాబాద్ అనంతపద్మనాభ స్వామి సాక్షిగా ఆగస్టు 15 వరకు రైతు రుణమాఫీ చేస్తామని మరోమారు ఒట్టేశారు. ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తున్న మోదీ పాలనకు చరమగీతం పాడాలని కోరారు. శ్రీరాముడు అందరివాడని, బీజేపీకే సొంతం కాదని, మతాలు, దేవుళ్ల పేరుతో రాజకీయం చేసే బీజేపీని నమ్మొద్దని, అదానీ, అంబానీలను మోదీ మోస్తున్నారని ధ్వజమెత్తారు. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు అంబేద్కర్ సర్కిల్‌లో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో రేవంత్ మాట్లాడుతూ మోదీ మళ్లీ వస్తే రాజ్యాంగాన్ని మార్చేస్తారని, రిజర్వేషన్లను రద్దు చేస్తారని ఆరోపించారు. సురక్షితంగా, ఆదర్శంగా ఉన్న తెలంగాణలో బీజేపీ నాయకులు మతం మంటలు రేపి గొడవలు చేసేందుకు కుట్ర పన్నుతున్నారని మండిపడ్డారు.

### ప్రియాంక మాట్లాడుతుండగానే వెళ్లిపోయిన జనాలు

తాండూరు సభలో ప్రియాంక గాంధీ మాట్లాడుతుండగానే జనాలు లేచి వెళ్లిపోవడం కనిపించింది. సభలో సరైన వసతులు లేవని వచ్చినవారు ఆగ్రహం వ్యక్తంచేశారు.

## తెలంగాణ సొమ్ము ఢిల్లీకి

- ఆర్ఆర్ ట్యాక్స్‌ను తరలిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- కాంగ్రెస్‌కు ఏటీఎంలా తెలంగాణ
- ఆ పార్టీకి సర్జికల్‌స్ట్రైక్స్ చేసే ధైర్యం లేదు
- కాంగ్రెస్ గెలిస్తే మళ్లీ ట్రిపుల్ తలాక్
- 'ఇండియా' గెలిస్తే ఏడాదికో ప్రధాని
- వికారాబాద్, వనపర్తి సభల్లో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా

వికారాబాద్/వనపర్తి, మే 11, (నమస్తే తెలంగాణ) : తెలంగాణను కాంగ్రెస్ ఏటీఎంలా మార్చుకున్నదని, ఇక్కడ సీఎం రేవంత్‌రెడ్డి ఆర్ఆర్ ట్యాక్స్ వసూలు చేసి ఢిల్లీకి తరలిస్తున్నాడని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా ఆరోపించారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే ముస్లింల రిజర్వేషన్లను రద్దు చేస్తామని పునరుద్ఘాటించారు. వికారాబాద్, వనపర్తి జిల్లా కేంద్రాల్లో శనివారం నిర్వహించిన జనసభల్లో ఆయన మాట్లాడుతూ ఇండి యా కూటమి అధికారంలోకొస్తే ప్రధాని శరద్‌పవార్ అవుతారా? లేక మమతబెనర్జీ యా?, స్టాలినా?, ఉద్ధవ్‌ఠాక్రేనా? లేక రాహుల్‌గాంధీయా? అని ఎద్దేవా చేశారు. ఓ టీవీ చానల్ ఇంటర్వ్యూలో ఇండియా కూటమి గెలిస్తే ప్రధాని ఎవరవుతారని రాహుల్‌గాంధీని అడిగితే ఏడాదికొకరు ప్రధానిగా పనిచేస్తారని చెప్పారని, ఏడాదికో ప్రధాని అయితే అత్యవసర సమయాల్లో దేశాన్ని ఎవరు రక్షిస్తారని ప్రశ్నించారు. తన ఫేక్ వీడియో షేరింగ్‌పై స్పందిస్తూ తాము అధికారంలోకి వచ్చాక సీఎం రేవంత్‌రెడ్డి తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. సర్జికల్ స్ట్రైక్స్‌తో కాకులను కూడా చంపలేదన్న రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలపై స్పందిస్తూ సర్జికల్ స్ట్రైక్స్‌తో ఉగ్రవాదులను అంతమొందించామని, సర్జికల్ స్ట్రైక్స్ చేసే ధైర్యం కాంగ్రెస్‌కు లేదని, ఉగ్రవాదులను కాంగ్రెస్ పెంచి పోషిస్తున్నదని విమర్శించారు. అయోధ్య రాముడి విగ్రహ ప్రతిష్ఠాపనకు ఖర్గే, రాహుల్, ప్రియాంకను ఆహ్వానిస్తే మజ్లిస్‌కు భయపడి హాజరుకాలేదని ఆరోపించారు. కాంగ్రెస్ వస్తే మళ్లీ ట్రిపుల్ తలాక్‌ను తీసుకువచ్చే ప్రయత్నం చేస్తుందని చెప్పారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయక మాట నిలబెట్టుకోని ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి నిలిచిపోయాడని విమర్శించారు. కాగా సభలో అమిత్ షా ప్రసంగిస్తుండగానే ప్రజలు లేచి వెళ్లిపోవడం కనిపించింది. బీజేపీ కార్యకర్తలు జనాలను ఆపేందుకు ప్రయత్నించినా ప్రసంగం ముగిసే సమయానికి ప్రాంగణం సగం ఖాళీ అయింది. వనపర్తి సభలో గాంధీనగర్‌కు చెందిన ఓ వృద్ధురాలు ఎండ తీవ్రత తాళలేక సొమ్మసిల్లి పడిపోయింది. వెంటనే కొందరు యువకులు ఆమెను బయటకు తీసుకెళ్లారు.

## ఐదు నెలల్లో ఎంతపనైపాయే

# హైదరాబాద్‌పై తీవ్ర ప్రభావం

### నష్టాలతో నడపలేమన్న ఎల్ ఎండ్ టీ కంపెనీ • కాంగ్రెస్ ఫ్రీ బస్సు స్కీమే కారణమని వెల్లడి

మెట్రో సేవలు నిలిచిపోతే నగరం ఆగమాగం • అటకెక్కనున్న మెట్రో కారిడార్ల విస్తరణ పనులు • హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌పైనా నీలినీడలు

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, మే 11 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ మెట్రో రైలును 2026 తర్వాత అమ్మకానికి పెట్టబోతున్నట్టు ఎల్ అండ్ టీ సంస్థ ప్రెసిడెంట్, శాశ్వత డైరెక్టర్, సీఎఫ్‌వో ఆర్ శంకర్ రామన్ చేసిన వ్యాఖ్యలు రాష్ట్రంలోనే కాదు దేశ పారిశ్రామికవర్గాల్లోనూ లోతైన చర్చ కు దారితీశాయి. కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన 'మహాలక్ష్మి' స్కీమ్ కారణంగా.. మహిళలు మెట్రోల్లో ప్రయాణానికి ఆసక్తి చూపట్లేదని, దీంతో భారీ నష్టాలు వస్తున్నాయని, అందుకే అమ్మకం పెట్టాలనుకొంటున్నట్టు రామన్ కుండబద్దలు కొట్టారు.

### ఎల్ అండ్ టీ తప్పుకొంటే ఎలా?

కాంగ్రెస్ 'ఫ్రీ' బస్సు స్కీమ్ కారణంగా నష్టా ల్లో కూరుకుపోతున్న హైదరాబాద్ మెట్రో రైలు ను నడుపలేమని ఎల్ ఎండ్ టీ తేల్చిచెప్పింది. 65 ఏండ్లపాటు పలు రాయితీలు ఉన్నప్పటికీ.. అమ్మకానికే తమ ప్రాధాన్యమని కుండబద్దలు కొట్టింది. ఒకవేళ మెట్రో రైలు నిర్వహణ నుంచి ఎల్ అండ్ టీ తప్పుకొంటే మరేదైనా ప్రైవేటు కంపెనీ మెట్రో బాధ్యతలను స్వీకరిస్తుందా? అంటే సమాధానం లేదు. దీనికి కారణం లేకపోలేదు. 78 ఏండ్ల చరిత్ర కలిగి, రూ. 3.4 లక్షల కోట్ల ఆస్తులు, రూ. 2.25 లక్షల కోట్ల ఆదా యం, 200 వరకూ అనుబంధ కంపెనీలు, 2.5 లక్షల మంది ఉద్యోగులు ఉన్న 'ఎల్ అండ్ టీ' వంటి సంస్థనే చేతులెత్తేస్తే 'హైదరాబాద్ మెట్రో' ను మరో కంపెనీ టేకోవర్ చేసే అవకాశాలు తక్కువని అంచనా వేస్తున్నారు.



**మెట్రో నిలిచిపోతే ట్రాఫిక్ నరకం**

1.3 కోట్ల జనాభా ఉన్న హైదరాబాద్‌లో దా దాపు 90 లక్షల వ్యక్తిగత వాహనాలు ఉన్నాయి. మెట్రో సర్వీసులు రావడంతో ఉద్యోగులు, సామాన్యులు వ్యక్తిగత వాహనాలను పక్కనబెట్టి మెట్రోలో ప్రయాణించారు. ట్రాఫిక్ కష్టాలు కొంతవరకూ తగ్గాయి. ఒక వేళ,మెట్రో సర్వీసు లు ఆగిపోతే, ట్రాఫిక్ ఇబ్బందులు పెరుగొచ్చు.

### ప్రభుత్వం టేకోవర్ చేస్తుందా?

దేశంలోని ప్రధాన మెట్రోపాలిటన్ నగరాల్లో మెట్రో సర్వీసులు నడుస్తున్నాయి. ఢిల్లీ, ముం బై, కోల్‌కతా, చెన్నై, బెంగళూరులోని సర్వీసులను ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు (కొన్ని చోట్ల కేంద్రం భాగస్వామ్యంతో) నిర్వహిస్తుండగా.. హైదరాబాద్ మెట్రో మాత్రం పీపీపీ (పబ్లిక్-ప్రైవేట్ భాగస్వామ్యం) పద్ధతిన నడుస్తున్నది. ప్రాజెక్టు నిర్వహణ బాధ్యతలో 90 శాతం వాటా ఎల్ ఎండ్ టీకి ఉండగా, మిగతా 10 శాతం రాష్ట్ర ప్రభుత్వానిది. ఒకవేళ, ప్రాజెక్టు నుంచి ఎల్ ఎండ్ టీ తప్పుకొంటే, ఇతరత్రా ఏ కంపెనీ ప్రాజెక్టు టేకోవర్‌కు ముందుకు రాకుంటే.. ప్రభుత్వమే ముందుకు వస్తుందా? అనేది మిలియన్ డాలర్ ప్రశ్న.

### కంపెనీల రాకపై ప్రభావం

నగరంలో పెట్టుబడులు పెట్టాలంటే ప్రతీ కంపెనీ ఆలోచించే ప్రాథమిక అంశం రవాణా సాధనాలు. ఉద్యోగులు ప్రయాణంలో అలిసిపోతే ఉత్పాదకతపై ప్రభావం చూపిస్తుంది. ఈ విషయాన్ని కంపెనీలు ప్రధానంగా తీసుకొంటాయి. రీజినల్ కనెక్టివిటీని కూడా విశ్లేషిస్తాయి. రవాణా సౌకర్యం మెరుగ్గా ఉన్న నగరాలకే సంస్థ లు వరుసకడతాయి. నగరంలో మెట్రోసేవలు నిలిచిపోతే, కంపెనీల రాకపై ప్రభావం పడొచ్చు.

### భూముల రేట్లు పడిపోయే ప్రమాదం

మెట్రో కారిడార్, స్టేషన్లు ఉన్న పరిధిలో భూముల రేట్లు బాగా పెరిగాయి. ట్రాన్స్‌పోర్ట్ కనెక్టివిటీ దీనికి ఒక కారణమైతే, స్టేషన్ల దగ్గర మాల్స్ ఏర్పాటు చేయడం మరో కారణం. ఒకవేళ, నగరంలో మెట్రో సర్వీసులు నిలిచిపోతే, భూముల రేట్లు అమాంతం పడిపోవచ్చు.

*'మెట్రో రైలు'లేని హైదరాబాద్‌ను ఓసారి ఊహించుకోండి!ఎందుకంటారా?? దేశంలోనే అతిపెద్ద బహుళజాతి సంస్థల్లో ఒకటైన ఎల్ అండ్ టీ సంస్థ.. తాము హైదరాబాద్ మెట్రోను నడపలేం బాబోయ్ అని చేతులెత్తేసింది మరి.*

*'ఫ్రీ' బస్సు స్కీమ్‌తో మెట్రోకు నష్టాలు వస్తున్నాయని, దీంతో మెట్రోను అమ్మేయాలనుకొంటున్నట్టు ఎల్ అండ్ టీ సంస్థ ప్రెసిడెంట్ ఆర్ శంకర్ రామన్ స్వయంగా ప్రకటించారు.*

**కాంగ్రెస్ సర్కారు నిర్వాకమే ఇది.**

### కాలుష్యం పైపైకి.. అటకెక్కనున్న విస్తరణ

హైదరాబాద్‌లో ప్రస్తుతం కరెంటు ఆధారిత మెట్రో సర్వీసులు నడుస్తున్నాయి. ఈ సేవలు నిలిచిపోతే, ప్రజలు వ్యక్తిగత వాహనాల వైపునకు మళ్లొచ్చు. దీంతో వాతావరణ కాలుష్యం పెరుగుతుంది. మెట్రో సేవలు నిలిచిపోతే.. ప్రతిపాదిత మెట్రో కారిడార్ల విస్తరణ ప్రణాళికలు అటకెక్కుతాయి.

### హైదరాబాద్ బ్రాండ్‌పై నీలినీడలు

దేశంలో తొలి మెట్రో రైలు కలకత్తాలో 1984లోనే ప్రారంభమైంది. 33 ఏండ్ల తర్వాత మనదగ్గర సేవలు మొదలయ్యాయి. మెట్రో సేవలు మళ్లీ నిలిచిపోతే.. టెక్, ఫార్మా, హాస్పిటాలిటీ రంగాలకు దిక్సూచీగా మారిన నగర బ్రాండ్ ఇమేజ్ దెబ్బతింటుంది. పారిశ్రామికవేత్తలు, పర్యాటకులు నగరంవైపు చూసే పరిస్థితి ఉండదని విశ్లేషకులు చెబుతున్నారు.

*78 ఏండ్ల చరిత్ర, రూ. 3.4 లక్షల కోట్ల ఆస్తులు, 2.25 లక్షల కోట్ల ఆదాయం, 200 వరకూ అనుబంధ కంపెనీలు, 2.5 లక్షల మంది ఉద్యోగులు ఉన్న 'ఎల్ అండ్ టీ' వంటి దిగ్గజ సంస్థనే వద్దనుకొన్న 'మెట్రో'ను ఏ కంపెనీ టేకోవర్ చేస్తుంది?*

*ఎవరూ ముందుకు రాకపోతే, రాష్ట్ర ప్రభుత్వమే మెట్రోను నడుపగలదా? దేశంలో తొలి మెట్రో నడిచిన 33 ఏండ్ల తర్వాత ఎంతో ఆలస్యంగా మన నగరానికి వచ్చిన మెట్రో పరుగు మళ్లీ ఆగిపోతే.. హైదరాబాద్ పరిస్థితేంటి??*

## మెట్రో రైల్.. ఫర్ సేల్

మూడోపేజీ తరువాయి...

బస్సు స్కీమ్ పథకంతో మెట్రో ఆదాయానికి గండిపడిందని పేర్కొన్నారు. ఇలాంటి సమయంలో మెట్రో రైళ్ల నిర్వహణ ఎలా సాధ్యమని ప్రశ్నించారు. 'ఫ్రీ' బస్సు స్కీమ్‌తో తెలంగాణ ఆర్టీసీ కూడా దివాళా తీసే దుస్థితి రావొచ్చని హెచ్చరించారు. ఈ మేరకు ఇంగ్లీష్ వార్తాఛానల్ 'బిజినెస్ టుడే' టీవీకి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు కీలక వ్యాఖ్యలు చేశారు.



### ఇంటర్వ్యూలో శంకర్ రామన్ కీలక వ్యాఖ్యలు

- హైదరాబాద్ మెట్రో నిర్వహణ బాధ్యతల నుంచి తప్పుకోవాలని భావిస్తున్నాం. 2026 తర్వాత దీనిపై నిర్ణయిస్తాం. ప్రాధాన్యంలేని వ్యాపారాల్లో భాగస్వామ్యాన్ని ఉపసంహరించుకొనే చర్యల్లో భాగంగా ఈ విక్రయం ఉంటుంది.
- మహిళలకు ఫ్రీ బస్సు సౌకర్యం పేరిట కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన 'మహాలక్ష్మి' స్కీమ్ కారణంగానే హైదరాబాద్ మెట్రో నిర్వహణ బాధ్యతల నుంచి వైదొలుగాలనుకొంటున్నాం.
- బస్సుల్లో ఉచిత ప్రయాణం ఉండటంతో మహిళలు ఎవరూ మెట్రోలో ప్రయాణించడానికి ఆసక్తి చూపించట్లేదు.
- రద్దీకి తగినట్టు బస్సుల సంఖ్యను ప్రభుత్వం పెంచట్లేదు. బస్సుల్లో సీట్లు దొరకని పురుషులు మాత్రమే మెట్రో ఎక్కుతున్నారు. లేడీస్ కంపార్ట్‌మెంట్లు అన్నీ దాదాపుగా ఖాళీగానే కనిపిస్తున్నాయి. క్యాబ్ సర్వీసులు పెరుగడం కూడా మెట్రోపై ప్రభావం చూపిస్తున్నది.
- వైదొలగాలనుకొన్న నిర్ణయం ఒక్కరోజులో తీసుకొన్నది కాదు. 'ఫ్రీ' బస్సు స్కీమ్ అమల్లోకి వచ్చినప్పటి నుంచి మెట్రోకు వస్తున్న నష్టాలను విశ్లేషించిన తర్వాతే ఈ ఆలోచనకు వచ్చాం.
- మెట్రో నిర్వహణకు సంబంధించి మరో 65 ఏండ్ల పాటు మాకు పలు రాయితీలు ఉన్నాయి. అయినప్పటికీ, నష్టాలను భరించలేకే వైదొలగాలనుకొంటున్నాం.
- మెట్రోలో ప్రస్తుతం రోజుకు 4.8 లక్షల మంది ప్రయాణిస్తున్నారు. మేం నడుపుతున్న సర్వీసులు, నిర్వహణ వ్యయం, ఇతరత్రా ఖర్చులతో పోలిస్తే, ఈ సంఖ్య సరిపోదు. దీంతో నష్టాలు వస్తున్నాయి.
- మహిళలు ఒక్క పైసా చెల్లించకుండా బస్సులను ప్రయాణ సాధనంగా వినియోగించుకొంటే, సగటున రూ. 35 టికెట్ చెల్లించి పురుషులు మెట్రోల్లో ప్రయాణిస్తున్నారు. ఈ పరిణామం రవాణా వ్యవస్థలో ఒకవిధంగా లింగ పంపిణీకి దారితీస్తున్నది.
- రాజకీయ వాగ్దానాలకు లోబడి కొనసాగుతున్న 'ఫ్రీ' బస్సు పథకం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు ఏవిధంగానూ ఉపయోగకరంగా ఉండబోదు.
- ఈ స్కీం తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీఎస్ఆర్టీసీ)ని అప్పుల పాల్చేసి దివాళా తీసేలా చేస్తుంది. ఇది సరదా విషయం కాదు.
- నిజానికి బస్సులకు ప్రతీ 5 ఏండ్లకు ఒకసారి మరమ్మతులు చేయాల్సి ఉంటుంది. 'ఫ్రీ' ప్రయాణాన్ని కల్పించుకొంటూ పోతుంటే.. బస్సుల మెయింటెనెన్స్‌కు డబ్బులు ఎక్కడ నుంచి వస్తాయి?
- కాలుష్యంలేని, ఆధునిక రవాణా వ్యవస్థలపై (మెట్రో సర్వీసులు) ప్రైవేటు సంస్థలు తమ డబ్బును ఖర్చు పెడుతుంటే.. వాతావరణ కాలుష్యానికి కారణమవుతున్న బస్సుల్లో ప్రజలు ఉచితంగా ప్రయాణించేందుకు ప్రభుత్వం డబ్బును వెదజల్లుతున్నది. ఇది ఆహ్వానించదగ్గ పరిణామం కాదు.

## విద్యుత్తు సిబ్బంది శ్రమను గుర్తించండి

హైదరాబాద్, మే 11 (నమస్తే తెలంగాణ) : ఎండనకా.. వాననకా శక్తికి మించి రేయింబవళ్లు పనిచేస్తూ కోతల్లేకుండా విద్యుత్తునందిస్తున్న విద్యుత్తు ఇంజినీర్లు, సిబ్బంది శ్రమను వినియోగదారులు గుర్తించాలని తెలంగాణ పవర్ ఎంప్లాయీస్ జాయింట్ యాక్షన్ కమిటీ (టీఎస్‌పీఈ జేఏసీ) కోరింది. సాంకేతిక కారణాలతోనే విద్యుత్తు అంతరాయాలు ఏర్పడుతున్నాయనే తప్ప, ఇందులో తమ నిర్లక్ష్యం ఏమీ లేదని జేఏసీ చైర్మన్ సాయిబాబా, కన్వీనర్ పీ రత్నాకర్‌రావు, కో చైర్మన్ శ్రీధర్, కో కన్వీనర్ బీసీరెడ్డి, పీ సదానందం స్పష్టంచేశారు. పలు మాధ్యమాల్లో విద్యుత్తు అంతరాయానికి సిబ్బందిని, ఇంజినీర్లను బాధ్యులను చేయడం తమను తీవ్రంగా కలచివేసిందని పేర్కొన్నారు. సిబ్బంది కొరత.. ఉష్ణోగ్రతల్లో మార్పులు.. విద్యుత్తు డిమాండ్ పెరిగిన నేపథ్యంలో విద్యుత్తు సిబ్బంది రెట్టింపు పనిభారంతో సేవలందిస్తున్న విషయాన్ని అంతా గుర్తించాలని విజ్ఞప్తి చేశారు. ప్రకృతి వైపరీత్యాలు, గాలివానలతో చెట్లకొమ్మలు విరిగిపడి అంతరాయం ఏర్పడుతుందని, ఈ క్రమంలో తక్షణమే విద్యుత్తు సరఫరాను పునరుద్ధరిస్తున్నామని తెలిపారు. వేసవి డిమాండ్ నేపథ్యంలో టీఎస్ఎస్పీడీసీఎల్ పరిధిలో 4,353 ట్రాన్స్‌ఫార్మర్లు అదనంగా ఏర్పాటు చేశామని, మరో 250 వరకు క్షేత్రస్థాయి కార్యాలయాల్లో అందుబాటులో ఉంచామని వివరించారు. ఈ వేసవిలోనూ కోతల్లేకుండా విద్యుత్తునందిస్తున్న సిబ్బందిని, ఇంజినీర్లను ఈ సందర్భంగా జేఏసీ నేతలు అభినందించారు.

## రిజర్వేషన్ల రద్దుపై మోదీ స్పష్టత ఇవ్వాలి

ముషీరాబాద్, మే 11: రాజ్యాంగాన్ని రద్దు చేసి, ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లను తొలగిస్తారనే చర్చపై మోదీ, బీజేపీ స్పష్టమైన ప్రకటన చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్ కృష్ణయ్య డిమాండ్ చేశారు. జనగణన, కులగణన, బీసీల 50% రిజర్వేషన్ల కల్పన విషయంలో బీజేపీ వైఖరేంటో చెప్పాలని కోరారు. శనివారం హైదరాబాద్ విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో ఆయన మాట్లాడుతూ.. ఓట్లకోసం బీసీ ప్రధాని అంటూనే బీసీలకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. బీజేపీ నేతలు బీసీలను మభ్యపెట్టడం మాని 50 శాతం రిజర్వేషన్లు, ఉద్యోగ ప్రమోషన్‌లలో రిజర్వేషన్‌లు, బీసీ మంత్రిత్వ శాఖ, ప్రైవేటు రంగంలో రిజర్వేషన్ల అంశాన్ని స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. బీజేపీ ఎన్నికల మ్యానిఫెస్టోలో ఎక్కడా బీసీ సమస్యలపై ప్రస్తావించకపోవడం శోచనీయమని, పదేళ్ల మోదీ పాలనలో బీసీల అభివృద్ధికి ఒక్క పథకాన్ని ప్రవేశపెట్టలేకపోయిందని మండిపడ్డారు. రిజర్వేషన్‌ల ఎత్తివేత అంశంతోపాటు కులగణన విషయంలో బీజేపీ స్పష్టతనిస్తేనే ఆ పార్టీకి బీసీలు ఓట్లు వేస్తారని, లేని పక్షంలో ఓటుతో సమాధానం చెప్పక తప్పదని హెచ్చరించారు. వచ్చే జూన్, జూలై నెలల్లో బీసీ సమస్యలపై దేశవ్యాప్తంగా ఉద్యమం లేవదీస్తామని హెచ్చరించారు. సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు గుజ్జ కృష్ణ, నీల వెంకటేశ్, రాజేందర్, అనంతయ్య, నందకిశోర్, ప్రణీతారాణి పాల్గొన్నారు.

## బీజేపీని క్రిస్టియన్లు ఓడించాలి

### క్రిస్టియన్ ఇంటలెక్చువల్ ఫోరం తీర్మానం

హైదరాబాద్, మే 11 (నమస్తే తెలంగాణ) : రాజ్యాంగాన్ని మార్చుతామని, రిజర్వేషన్లను సమూలంగా తీసేస్తామని చెబుతున్న బీజేపీని క్రిస్టియన్ మైనార్టీలంతా కలిసి ఓడించాలని 'క్రిస్టియన్ ఇంటలెక్చువల్ ఫోరం' పిలుపునిచ్చింది. శనివారం హైదరాబాద్‌లోని టూరిజం ప్లాజాలో 'భారత రాజ్యాంగం, రిజర్వేషన్ల రక్షణ కోసం గొంతు విప్పుదాం' అనే అంశంపై రాష్ట్ర క్రిస్టియన్ మేధావులు నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో ప్రొఫెసర్ రాజేశ్ సాలోమాన్ మాట్లాడుతూ.. దేశంలోని అణగారిన, బలహీనవర్గాలకు న్యాయం చేసేందుకు ఆ దేవుడు పంపిన అభినవ ప్రవక్త డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అని కొనియాడారు. అన్ని వర్గాలకు సమన్యా యం జరగాలంటే కచ్చితంగా రిజర్వేషన్ ఉండాల్సిందేనని డాక్టర్ అశిష్ చౌహాన్ అన్నారు. బీజేపీ పాలనలో క్రైస్తవులపై దాడులు విపరీతంగా పెరుగుతున్నాయని, అలాంటి సమయంలోనైనా రాజ్యాంగ హక్కులను ఉపయోగించుకోవాలని రిటైర్డ్ ఏడీజీ బాబురావు చెప్పారు. క్రిస్టియన్లంతా బీజేపీకి ఓటుతో బుద్ధి చెప్పాలని సమావేశం తీర్మానించింది. సమావేశంలో రిటైర్డ్ ఐపీఎస్ మధుకుమార్, సుధీర్, దాస్ యోనాతన్, ఉదయ్‌కాంత్, వివిధ చర్చిల పాస్టర్లు పాల్గొన్నారు.